18వ
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం,6 ఫిబ్రవరి 2025


# విద్యుత్ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**– సిఎస్ విజయానంద్‌ని కలిసిన ఏఐటియుసి విద్యుత్ కార్మిక సంఘం నాయకులు**

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలోని విద్యుత్తు ఉత్పత్తి, పంపిణీ, సరఫరాలలో పనిచేస్తున్న ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బి.రామలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పొన్న శివయ్య లు కోరారు. బుధవారం విజయవాడలోని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ని వారి క్యాంపు కార్యాలయంలో కలసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో 30 వేల పైచిలుకు ఒప్పంద ప్రతిపాదికన కార్మికులు పనిచేస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులరైజేషన్ చేయాలని, పిఆర్సి అరియర్స్ ఇవ్వాలని, గ్రామ వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలని, ఎలక్ట్రిసిటీ బోర్డు సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, విద్యుత్ ఉద్యోగులకు ఈపీఎఫ్ నుండి జిపిఎఫ్‌గా మార్పు చేసి పాత విధానంలో పెన్షన్ అమలు చేయాలని, విద్యుత్ ఉద్యోగులకు నగదురహిత అపరిమిత ఆరోగ్య పాలసీని తీసుకురావాలని కోరారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలు అన్నింటిపైన అవగాహన ఉందని, ఒక్కొక్కటిగా పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ గ్రామ వార్డు ఎనర్జీ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కే.మల్లికార్జున రెడ్డి, ఎపి ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సాక శ్రీనివాస శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసోబు, కే.బ్రహ్మానందరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎం.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకు సమిష్టి కృషితో పని చేద్దాం!

**– గిరిజన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** కూటమి పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపుకు సమిష్టి కృషితో పని చేద్దామని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. రంపచోడవరంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అధ్యక్షతన ఎన్డీఏ కూటమి పార్టీలు నాయకులు కార్యకర్తలుతో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష సమావేశం జరిగింది.ఈసమావేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రంపచోడవరం ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గం విస్తీర్ణంలో అతి పెద్దదన్నారు.అటువంటి ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఓటర్లను నమోదు చేయడంలో కీలక పాత్ర పోషించిన కూటమి పార్టీ శ్రేణుల కృషికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఓటర్లు సుమారు 4,660 ఓట్లు ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే శిరీష దేవిఆధ్వర్యంలో11 మండలాల్లోని ఎన్డీయే కూటమి పార్టీల నాయకుల సహకారంతో కలిసి తిరిగి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మీ అమూల్యమైన ఓటును వరుస సంఖ్య ఒకటిపై వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో, పట్టభద్రులు ఎన్నికల్లో నాలుగు ఎమ్మెల్సీలను కైవసం చేసుకున్న విషయాన్ని మంత్రి గుర్తు చేసి, ఈ ఎన్నికల్లోను అందరూ సమిష్టిగా కష్టపడి రాజశేఖరం గెలుపుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం దేశ ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,జనసేనపార్టీ అధ్యక్షులు,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందని ఆమె పేర్కొన్నారు.ఈసందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ అందరూ తన నా గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల పరిశీలకులు దాడి రత్నాకర్, నియోజకవర్గం పరిశీలకులు చెల్లిబోయిన శ్రీనివాసరావు, మాజీ శాసనసభ్యులు వంతల రాజేశ్వరి, చిన్నం బాబూ రమేష్, శీతంశెట్టి వెంకటేశ్వరరావు, జిసిసి డైరెక్టర్ గొర్లె సునీత, రంపచోడవరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, బిజెపి నాయకులు బుల్లి కొండలు దొర, భారతి, జనసేన నాయకులు కుర్ల రాజశేఖర్, ఎన్డీయే కూటమి పార్టీల 11 మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలు, మండల, నియోజకవర్గం, రాష్ట్రస్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాపనమ్మ అమ్మవారికి మంత్రి పూజలు..

రంపచోడవరం మండలం సీతపల్లి మాతృశ్రీ గడి బాపనమ్మ అమ్మవారికి రాష్ట్ర గిరిజన మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రత్యేక పూజలు చేశారు. రంపచోడవరంలో ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో పాల్గొనడానికి బుధవారం వచ్చిన మంత్రి మార్గం మధ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి పార్టీ నాయకులు స్వాగతం పలికారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ రాజవొమ్మంగిలో కార్మికులు నిరసన

**– తాసిల్దార్‌కు వినతి పత్రం**

**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** ప్రభుత్వం లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని రాజవొమ్మంగి లో కార్మికులు నిరసన చేపట్టారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపధ్యక్షులు పి రామరాజు. మండల నాయకులు కె వెంకటలక్ష్మి,టి శ్రీను, సీహెచ్ వెంకటలక్ష్మి,ఎ అమ్మిరాజు,తదితరులు మాట్లాడుతూ.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అలానే కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని,స్కీం వర్కర్ల కనీస వేతనం రూ 26,వేలు అమలు చేయాలని,అంగన్వాడి, ఆశ,మిడ్డే మీల్స్ వర్కర్లు,కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని,భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పటిష్టంగా అమలు చేయాలని, క్లెములు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి,పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాహశీల్దార్ అల్లు సత్యనారాయణకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులుఎస్ వీ రబాబు,గిరిజనసంఘం నాయకులు కె జగన్నాధం,అంగన్వాడి, ఆశ,తదితర యూనియన్ నాయకులు చంద్రావతి, రత్నం, చిన్నమ్మలు, మంగ, సత్యవతి, సుందరమ్మ, సూర్యకుమారి, పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత శాతానికి కృషి

**– ఎబిసి సూరిబాబు**

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** సాంఘీక సంక్షేమ వసతి గృహాలలో వసతి పొందుతూ చదువుతున్న విద్యార్థులు పదవతరగతి పబ్లిక్ పరీక్షలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సంబంధిత హెచ్.డబ్లూ.ఓ.లకు (హాస్టల్ వెల్ఫేర్ అధికారులు) పెద్దాపురం అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారి ఆకుల సూరిబాబు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ కాకుండా చూడాలని, ప్రతీ ఒక్కరిపైన ప్రత్యేక దృష్టి సారించాలని, వసతి గృహ అధికారులను ఆయన ఆదేశించారు. పదవ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ప్రస్తుతం విద్యార్థులు అకడమిక్ సామర్థ్యం, పరీక్షలలో నూరుశాతం ఉత్తీర్ణతకు తీసుకోవలసిన చర్యలు తదితర వాటిపై హెచ్‌డబ్లూఓలకు మార్గనిర్దేశనం చేశారు. ఈ ఏడాది సమిష్టిగా కృషి చేసి వందశాతం ఉత్తీర్ణత శాతం తీసుకురావాలని, అలాగే సబ్జెక్టు నిపుణులు, ట్యూటర్లతో ప్రత్యేక శిక్షణ ఇచ్చి, విద్యార్థులు ఏ అంశాలలో వెనుకబడి ఉన్నారో, ఆయా అంశాలపై పట్టు సాధించేలా చూడా లన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల పురోగతిని సమీక్షించాలని, అలాగే విద్యార్థి జీవితంలో పదవ తరగతి పరీక్షల ప్రాధాన్యం ఏమిటో వివరించి, మంచి మార్కులుతో ఉత్తీర్ణత సాధించేలా ప్రొత్సహించాలన్నారు.

ఉదయం, సాయంత్రం సమయాలలో ప్రత్యేక స్టడి అవర్స్ నిర్వహించాలని సూచించారు. పెద్దాపురం డివిజన్ పరిధిలో ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట, ప్రభుత్వ బాలిక వసతి గృహాలలో ప్రత్తిపాడు 14మంది, పెద్దాపురంలో 12మంది, జగ్గంపేటలో ఒక విద్యార్థి పదవ తరగతి చదువుతున్నారని వీరి ఉత్తీర్ణతకు హెచ్‌డబ్లూఓలు ప్రత్యేక దృష్టి సారించాలని అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారి ఆకుల సూరిబాబు సూచించారు. ఈ సమావేశంలో కార్యాలయ సిబ్బంది సతీష్ కుమార్, తదితరులు ఉన్నారు.

## కార్పొరేట్ స్థాయిలో పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే మా నేతాజీ హాస్పిటల్ లక్ష్యం

**– డాక్టర్ హేమంత్ కాకర్ల – ఉచితంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరం విజయవంతం**

**చింతూరు, మేజర్ న్యూస్ :** భద్రాచలం నేతాజీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో చింతూరు గ్రామంలోని క్రికెట్ గ్రౌండ్ వారపు సంత ప్రాంగణంలో నందు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ హేమంత్ కాకర్ల, డాక్టర్ వై. రాజశేఖర్ రెడ్డి లు రిబ్బన్ కట్ చేసి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎముకలు వైద్య నిపుణులు డాక్టర్ హేమంత్ కాకర్ల మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం ప్రజలకోసం కార్పొరేట్ స్థాయిలో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించానే లక్ష్యంతో ఆర్థోపెడిక్ లాప్రోస్కోపిక్ సేవలు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. మా హాస్పిటల్ నందు లాప్రోస్కోపీ వైద్య సేవలు తక్కువ కోత, తక్కువ ఖర్చు, త్వరగా కోలుకునే లాగా అత్యాధునిక వైద్య చికిత్సలతోపాటు ఆర్థోపెడిక్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ఎముకలు విరిగిన వారికి ఆపరేషన్లు, అలాగే మోకాళ్ళ కీళ్ల మార్పిడి ఆపరేషన్లు , కీళ్లవాతానికి సంబంధించిన సమస్యలకు, యాక్సిడెంట్ కేసులకు మరియు అన్ని ఎమర్జెన్సీ కేసులకు 24 గంటలు వైద్యం అందించబడు నని తెలిపారు. కావున ప్రజలందరూ మా యొక్క వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో ఎముకల వైద్య నిపుణులు ఎంఎస్ ఆర్థో డాక్టర్ హేమంత్ కాకర్ల, ప్రముఖ చిన్న పిల్లల వైద్యునిపుణులు డాక్టర్ వై రాజశేఖర్ రెడ్డి, శిబిరానికి వచ్చిన 220 మంది ప్రజలకు అవసరమైన వారికి 2500 రూపాయల విలువగల ఎముకల సాంద్రత బిఎండి పరీక్ష, అలాగే గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్ష, షుగర్ పరీక్ష ఉచితంగా నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరిగినది. ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి సహకరించి, విజయవంతం చేసినందుకు ప్రజలకు, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ నిర్వహకులు జక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, డా. నరసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిత్యలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సాంబమూర్తినగర్‌లో గల ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్స్ అంకాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్ భాస్కర్ గారిచే కళాశాల విద్యార్థినులకు క్యాన్సర్ మీద అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ మారిన జీవనశైలి మరియు వివిధ రకాల ఆహరపు అలవాట్లు వల్ల పురుషులు, మహిళలు అనే లింగభేధం లేకుండా ప్రస్తుతం చాలా మంది అనేక రకాల క్యాన్సర్ల బారిన పడుతున్నారు అని అభిప్రాయపడ్డారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ కాన్సర్ కణాలు వాటి జన్యువులలో బహుళ మార్పుల వల్ల అభివృద్ధి చెందుతాయి.జీవనశైలి అలవాట్లు, తల్లిదండ్రుల నుండి పొందే జన్యువులు మరియు వాతావరణంలో కాన్సర్ కారక ఏజెంట్లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ప్రదీప్ భాస్కర్ ప్రథమ దశలోనే కాన్సర్‌ని గుర్తించడం ద్వారా అదుపు చేయవచ్చుని తెలిపారు. ముఖ్యంగా ఆడవారిలో రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ ఎక్కువగా ఉంటాయని, అవగాహన మాత్రమే లక్షణాలను తొలి దశలోనే గుర్తించి వైద్య నిపుణులను సంప్రదిస్తే అరికట్టవచ్చని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్ మాట్లాడుతూ కాన్సర్ ఒక్క మహమ్మారి, కానీ ఇప్పుడు అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ వలన మరియు అవగాహన వలన అరికట్టవచ్చని తెలిపారుఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్ పి.సురేఖ దేవి, ఎమ్.శ్రీనివాస్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎన్.సత్యవతి, మెడికవర్ హాస్పిటల్ యాక్టివిటీ మేనేజర్ అభిలాష్, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు మరియు అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12న రాష్ట్రవ్యాప్త మన్యం బందు

**– జేఏసీ చింతూర్ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్**

**చింతూరు,మేజర్‌న్యూస్ :** టూరిజం పారిశ్రామికవేత్తల సమావేశంలో షెడ్యూల్ ప్రాంతంలో ఎస్టీలు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టలేరని ఎస్టీలను కించపరుస్తూ,1/70 భూ బాదలయింపు నిషేధ చట్టాన్ని సవరణ చేయడానికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కలెక్టర్లకు సూచించడాన్ని నిరసిస్తూ ఈనెల 12వ తారీఖున రాష్ట్రవ్యాప్త మన్యం బందుకు ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ పిలుపునిచ్చింది. 1/70 చట్టం అసెంబ్లీ పరిధిలోది కాదు. రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలు పేరా 5 (2) ప్రకారం టిఎసి తో కూడిన గవర్నర్ ద్వారా చట్టం చేయబడింది అన్నారు. అసెంబ్లీ ఏర్పడి సుమారు 7 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేయకపోవడం రాజ్యాంగాన్ని అవమానపరచుటమేనని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ చింతూరు డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ అన్నారు. ఎంతో బాధ్యతయుతమైన స్పీకర్ పదవిలో ఉండి ఆదివాసి చట్టాలపై తనకు అవగాహన లేదని చెప్పడం సిగ్గుచేటని, ఆదివాసి చట్టాలపై గౌరవం లేని వ్యక్తి స్పీకర్ గా ఉండటం ఆంధ్రప్రదేశ్ ప్రజల దౌర్భాగ్యమని అన్నారు. వేల కోట్లు టిఎస్సి నిధులు దారి మళ్ళించి ఎస్టీలను పేదలను చేసింది మీరు కాదా? అని ప్రశ్నించారు. ఆదివాసీలు కొట్లలో పెట్టుబడులు పెట్టలేరని హేళనగా మాట్లాడటం ఆయన యొక్క సూక్ష్మ బుద్ధికి నిదర్శనం అని అన్నారు. ఆదివాసుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాలోకి మళ్లించిన విషయాన్ని దాచిపెట్టి ఏజెన్సీ ప్రాంతల అభివృద్ధికి 1/70 చట్టం అడ్డుపడుతుందని అనడం హాస్యాస్పదంగా ఉందని, స్పీకర్ తన పరిధిలో లేని అంశాన్ని అవహేళన చేసి మాట్లాడినందుకు ఆదివాసీలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో మోసం మహేష్, కాకా సీతరామయ్య, బీరబోయిన లక్ష్మణ్, పొడియం జోగారావు, కాకా నాగేశ్వరావు, బీరబోయిన సత్యనారాయణ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్‌పై ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం

పిఠాపురం, మేజర్ న్యూస్ : ట్రాఫిక్ నియమాలు మరియు సేఫ్టీ డ్రైవింగ్ తదితర అంశాలపై ఆటో డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు.

పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్, మరియు పిఠాపురం పట్టణ ఎస్ఐ వి. మణి కుమార్, అదనపు ఎస్సై ఎస్. కె బాషా వారి సిబ్బందితో కలిసి పిఠాపురం పట్టణ బస్టాప్ సెంటర్లో ఆటో డ్రైవర్ అందరికీ సేఫ్టీ డ్రైవింగ్, ప్రజా భద్రత మరియు ట్రాఫిక్ నియమ నిబంధనలు, లైసెన్స్, ఇన్సూరెన్స్ వాటి ప్రాముఖ్యత గురించి, పెరుగుతున్నటువంటి, యాక్సిడెంట్లు వాటి నివారణ గురించి సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. అదే విధంగా వారికి ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ పై అవగాహన కల్పించడం జరిగిందని పేర్కొన్నారు.

# రైతులకు – కొత్త అగ్రిస్టాక్ రిజిస్ట్రేషన్

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** బుధవారం రాజవోలు గ్రామం, రాజమహేంద్రవరం రూరల్ మండలంలో జిల్లా వ్యవసాధికారి ఎస్. మాధవరావు కొత్తగా ప్రవేశపెట్టిన అగ్రి స్టాక్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో రైతులకు రిజిస్ట్రేషన్ ఎలా చేస్తున్నారో తెలుసుకుని వాటిలో ఇంకా ఏమన్నా తప్పులు ఉన్నచో రికార్డ్ చేసుకుని మరింత సులభంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసేలా రైతు సేవ కేంద్రాల్లో సిబ్బందికి తెలియజేశారు. రిజిస్ట్రేషన్ రైతుకు అనేక విధాలుగా ఉపయోగపడుతుందని ముఖ్యంగా రాష్ట్ర మరియు కేంద్ర పథకాలకు రిజిస్టర్ నమోదు కచ్చితంగా ఉండాలని రైతులకు తెలియజేయడం జరిగింది. ముఖ్యంగా ఈ ఐడి ద్వారానే రైతులకు లబ్ది జరుగుతుందని , వివిధ పథకాలకు ఐడి వర్తింపు చెయ్యడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆర్ ఎస్ కే సిబ్బంది రిజిస్ట్రేషన్ చేసినప్పుడు 100% చూపిస్తే రికార్డు డైరెక్ట్ గా ఎమ్మార్వో లాగిన్ కి అప్రూవల్ కోసం వెళ్తుంది. అదే 80% కన్నా తక్కువ ఉంటే గ్రామ రెవెన్యూ అధికారికి లాగిన్ లోకి వెళ్తుంది .వీఆర్వో ఆధార్ లో నమోదైన తప్పులు మరియు సంబంధిత సర్వే నెంబర్లు ఏమన్నా తప్పులు ఉంటే సరిచేసి మళ్లీ ఎమ్మార్వో లాగిన్ కి పంపడం జరుగుతుంది. రైతులందరూ మీ గ్రామానికి సంబంధించి రైతు సేవ కేంద్రాలలో రిజిస్ట్రేషన్ అనేది కచ్చితంగా చేయించుకోవాలని తద్వారా రైతులు కేంద్ర రాష్ట్ర పథకాలకు అర్హులు అవుతారు అని తెలియజేశారు. రైతులకు రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత 21 నెంబర్లు గల ఐడి అనేది మీ యొక్క మొబైల్ నెంబర్ కి మెసేజ్ వస్తుంది. రైతులు రైతు సేవ కేంద్రం కి వెళ్లే ముందు పట్టుకు వెళ్ళవలసిన డాక్యుమెంట్స్– ఆధార్ కార్డ్ , కొత్తగా వచ్చిన ఎల్పీ నెంబర్ తో కూడిన 1బి/పాస్ బుక్ జిరాక్స్,రేషన్ కార్డ్ ఆధార్ లింక్ అయినా ఫోన్ తీసుకు రావలెను. ఈ సదవకాశాన్ని రైతులందరూ ఉపయోగించుకొని పథకాలు లబ్ది పొందాలి

## సిఆర్పీ సతీష్‌ను ఘనంగా సత్కరించిన బోర్నగూడెం ఉపాధ్యాయులు

**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** మండలంలోని బొర్నగూడెం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పని చేస్తున్న సిఆర్పీ చవలం సతీష్‌ను బోర్నగూడెం ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. బుధవారం బోర్నగూడెం ఆశ్రమ పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయులు రమేష్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి సతీష్ కు పూలమాలలు వేసి దుస్సాలు వాలతోఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయులు రమేష్ మాట్లాడుతూవిధి నిర్వహణలో అనేక సేవలు అందించిన సీఆర్పీ సతీష్ సేవలను గుర్తించి గత జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని రంపచోడవరం లో ఏర్పాటుచేసిన వేడుకల్లో సతీష్ కు నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి,ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ చేతుల మీదుగా బెస్ట్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్( సిఆర్పీ )ప్రశంస పత్రంఅందజేశారన్నారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది బొడరాపు కృష్ణ,దుంప వరప్రసాద్,శివ ప్రసాద్,పాండురంగస్వామి,గంగన్న దొర,సతీష్, విజయబాబు,విశ్వనాథరెడ్డి, పాపారావు,బాలరాజులు,ఎల్ రాంబాబు, ఎం.రాంబాబు రికార్డ్ అసిస్టెంట్ గొర్లె రాఘవ,జూనియర్ అసిస్టెంట్ సుశీల తదితరులు ఉన్నారు.

## పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పి

**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్** : కాకినాడ జిల్లా, పెద్దాపురం పోలీస్ స్టేషన్‌ను బుధవారం మధ్యాహ్నం జిల్లా ఎస్పి జి.బిందు మాధవ్ ఆకస్మిక తనిఖీ చేశారు.

దీనిలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, భవనాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్సై వి.మౌనిక, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విశిష్ట సేవ రత్న అవార్డు గ్రహీత స్పార్క్ చైర్మన్ సాయి సందీప్‌ను సన్మానించిన ప్రముఖులు

**ఏలేశ్వరం, మేజర్ న్యూస్** : విశిష్ట సేవాపురస్కారం అందుకున్న స్పార్క్ ఫౌండేషన్ చైర్మన్ మరియు ఎథికల్ హ్యాకర్ ఎక్స్పర్ట్ సాయి సందీప్ ను ఏలేశ్వరం వైసిపి నాయకులు కౌన్సిలర్ బదిరెడ్డి గోవింద్ నివాసం వద్ద బుధవారం ఘనంగా సత్కరించారు. విశిష్ట సేవారత్న అవార్డు తీసుకున్న సాయి సందీప్‌ను నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు సిడగం వెంకటేశ్వరరావు మండల రూరల్ వైసిపి అధ్యక్షులు గొల్లపల్లి సురేష్,నాయకులు గొల్లపల్లి కాశీ సాలువల కప్పి అభినందించారు. ప్రజలకు యువతకు మహిళలుకుఎన్నో అవగాహన కార్యక్రమాలు, చేపట్టిన సందీప్ కు విశిష్ట సేవా పురస్కారం రావడం చాలా సంతోషదాయకమని బదిరెడ్డి గోవింద్ తెలిపారు భవిష్యత్తులో మరిన్ని అవార్డులు స్వీకరించి ఈ ప్రాంతానికిగుర్తింపు తీసుకురావాలని సందర్భంగా అభిప్రాయపడ్డారు. సాయి సందీప్‌ను సన్మానించి నవారిలో పైల విజయ్, డేగల చంద్రమౌళి, లోగేసు శేఖర్, బంటుపల్లి శ్రవణ్, దణబాబు, దత్తి రాజా, తోపాటు స్పార్క్ సంస్థ. స్టేట్ కో ఆర్డినేటర్ సభ్యులు రవి, సాయి, కామేష్, ఆదిత్య పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం పనులను ముమ్మరంగా నిర్వహించాలి

### అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం

**కాకినాడ,మేజర్న్యూస్** : జిల్లాలో రానున్న 45 రోజుల పాటు అధిక సంఖ్యలో కూలీల హాజరుతో ఉపాధి హామీ పథకం పనులను ముమ్మరంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. బుధవారం మద్యాహ్నం కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా కలెక్టర్ డ్వామా, పంచాయితీరాజ్ అధికారులు, యండిఓలతో సమావేశం నిర్వహించి జిల్లాలో నిర్వహిస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకం పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన రోడ్లు, గోకులం పశువుల షెడ్లు తదితర పనులన్నిటినీ మార్చి మాసాంతానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకా పారంభం కాని పనులన్నిటీని వెంటనే మొదలు పెట్టి ముమ్మరంగా నిర్వహించాలన్నారు. గ్రౌండ్ చేసిన పనుల వివరాలు, వాటికి ఎఫ్టిఓల జనరేషన్, బిల్స్ అన్ లైన్ అప్ లోడింగ్ ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని ఆదేశించారు. మంజూరు చేసిన ప్రతి పని తప్పనిసరిగా పూర్తి కావాలని, మంజూరు చేసిన ఒక్క రూపాయి కూడా వృధా కారాదని కలెక్టర్ ఖచ్చితమైన ఆదేశాలను అధికారులకు జారీ చేశారు. నిర్ధేశించుకున్న పనిదినాల లక్ష్యాన్ని సాధించేందుకు ఉపాధి పనులకు హాజరౌతున్న కూలీల సంఖ్యను రానున్న 45 రోజుల పాటు

మరింత పెంచాలని సూచించారు. ఈ వారం కూలీల హజరు శాతం ఏలేశ్వరం మండలంలో బాగుందని కలెక్టర్ ప్రసంశించి, ఉపాధి పనుల అవసరం, అవకాశం ఎక్కువగా ఉన్న కోటనందూరు మండలంలో ఆశించిన స్థాయిలో లేక పోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేసారు. రెడ్ క్రాస్ సభ్యత్వాలు, విరాళాల సేకరణ ముమ్మరం చేయండి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు, విరాళాల సేకరణ, సేవ కార్యక్రమాల నిర్వహణలో గడచిన 30 ఏళ్లుగా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుస్తున్న ఆదర్శనీయ ఒరవడిని కాకినాడ జిల్లా కొనసాగించేలా, జిల్లా, మండల అధికారులు చైతన్యవంతమైన పాత్ర వహించాలని జిల్లా కలెక్టర్ సమావేశంలో కోరారు. సమాజ హితం, ఆపన్నుల సహాయం కోసం చేసే ప్రతి కృషి అనిర్వచనీయమైన సంతోషాన్ని, తృప్తిని అందిస్తుందని, రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు, విరాళాల సేకరణ పెద్ద స్థాయిలో చేపట్టాలని ఆయన అధికారులను కోరారు. లక్షలు రూపాయలు విరాళాలు సేకరించిన వారిని వెండి పతంకంతోను, 2 లక్షలు ఆపై విరాళాలు సేకరించినవారిని గోల్డ్ మెడల్‌తోను రెడ్ క్రాస్ సొసైటీ సత్కరిస్తుందని కలెక్టర్ తెలియజేశారు. శివరాత్రి ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టండి ఈ నెల 26వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలలో భక్తుల రద్దీకి అనుగుణంగా సదుపాయాలు, రక్షణ ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సందర్శకుల కొరకు రవాణా, త్రాగునీరు, సురక్షిత స్నాన ఘట్టాలు, దుస్తుల మార్చుకునేందుకు చేంజింగ్ రూమ్‌లు, మరుగు దొడ్లు, బారికేడింగ్, లైటింగ్, సూచనలు ఇచ్చేందుకు, తప్పిపోయినవారి జాడ తెలిపేందుకు మైక్ సిస్టమ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. పారిశుద్య పరిరక్షణ చర్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ సమావేశంలో డ్వామా పిడి అడపా వెంకటలక్ష్మి, పంచాయితీరాజ్ ఎస్ఈ ఎవిఎస్ శ్రీనివాస్, జడ్పి సిఈఓ వివివిఎస్ లక్ష్మణరావు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి ప్రసాద్ బాబు, యండిఓలు, ఎపిడిలు, పంచాయితీ రాజ్ ఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## కాకినాడ స్మార్ట్ సిటీ ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో రాజేష్ ప్యానెల్ ఘన విజయం

**కాకినాడ, మేజర్ న్యూస్** : ప్రతిష్టాత్మకంగా జరిగిన కాకినాడ స్మార్ట్ సిటీ ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో రెడ్డిపల్లి రాజేష్ ప్యానెల్ ఘన విజయం సాధించింది. గవర్నింగ్ బాడీ ఆధ్వర్యంలో బుధవారం కాకినాడలో ప్రెస్‌క్లబ్ ఎన్నికల్ని నిర్వహించారు.ఎన్నికల రిటర్నింగ్ అదికారి అంజిబాబు ఆధ్వర్యంలో పూర్తి పారదర్శకంగా, ప్రజాస్వామ్య యుతంగా ఈ ఎన్నికలు జరిగాయి. 3వ తేదీన నామినేషన్ ప్రక్రియ జరగ్గా రాజేష్ ప్యానెల్ కోశాధికారి, ఒక జాయింట్ సెక్రటరీ పదవులు ఏకగ్రీవంగా గెల్చుకుంది. బుధవారం ఉదయం 10గంటల్నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు జరిగిన పోలింగ్ లో 96శాతం మంది సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం క్లబ్‌లో 133మంది సభ్యులుండగా 127మంది పోలింగ్‌లో పాల్గొని ఓట్లేశారు. రాజేష్ ప్యానెల్ తరపున పోటీ చేసిన అభ్యర్థులందరూ ఘన విజయం సాధించారు. అధ్యక్షునిగా రెడ్డిపల్లి రాజేష్ (ఐ న్యూస్), కార్యదర్శిగా డెంకాడ మోహన్ (సిటీకేబుల్), కోసాధికారిగా పి.చైతన్య (10టివి), ఉపాధ్యక్షులుగా చిక్కం షణ్ముఖ పళ్ళంరాజు (ఆంధ్రప్రభ), వి.గోపినాథ్ (ఎన్‌డి టివి), సంయుక్త కార్యదర్శులుగా ఎస్‌కె చిష్టి (కెసిసి ఛానల్), డి.ఏడుకొండలు (పెన్‌పవర్), సభ్యులుగా ఆకెళ్ళ శ్రీనివాస్ (గ్రేటర్ న్యూస్), గుండు శ్రీనివాస్ (హెచ్ఎమ్ టివి), ఎమ్.వెంకటరమణ (సాక్షి టివి), అనసూరి సూర్యనారాయణ (టివి 9), ఎమ్ఎస్ఎస్ కిషోర్ (99టివి)లు విజయం సాధించగా ముమ్మిడి లక్ష్మణ్ ప్యానెల్ నుంచి కార్యవర్గ సభ్యురాలిగా పోటీ చేసిన జె.కె.మహలక్ష్మి (బిఆర్‌కె న్యూస్) గెలుపొందారు. గవర్నింగ్ కమిటీసభ్యులుగా స్వాతిప్రసాద్,ఎన్‌కెదుర్రాని,సబ్బెళ్ళ శివన్నారా యణరెడ్డి, డి.ఎస్.ఎస్. రామాంజ నేయులు (అంజిబాబు), నవీన్ రాజ్,వీధి సాయినాథ్, కృష్ణంరాజు, ఎల్.శ్రీనివాసరావు (ఎల్ఎస్), ఎమ్.కృష్ణ, దుర్గారావు, మూర్తి లు వ్యవహరించారు.

## కొవ్వూరు ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ఎం.డి.యు ఆపరేటర్ల నిరసన

**కొవ్వూరు, మేజర్ న్యూస్** : ఎం.డి.యు ఆపరేటర్ల పై రాజకీయ కక్ష సాధింపులు చేస్తున్నారని కొవ్వూరు మండల ఎం.డి.యు ఆపరేటర్లు కొవ్వూరు ఎమ్మార్వో ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. ఇటీవల దొమ్మేరు ఎం.డి.యు ఆపరేటర్‌పై ఎటువంటి నోటీసు ఇవ్వకుండా తనను విధుల్లోంచి తొలగించారని ఎం.డి.యు.ఆపరేటర్ బి.రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి సీఎం గా ఉండగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వెహికల్ నాకు శాంక్షన్ అయిందని గత నాలుగు సంవత్సరాలుగా వెహికల్ఈ.యం.ఐ కడుతూ రేషన్ డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నానని అన్నారు తనకు ఇచ్చిన కార్డులను పూర్తి చేస్తూ ఎటువంటి రిమార్కు లేకుండా డిస్ట్రిబ్యూషన్ కొనసాగిస్తున్నాను అని అన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని పోషించుకుం టున్నానని రాత్రికి రాత్రి ఎటువంటి ఇంటిమేషన్ లేకుండా వేరే వ్యక్తిని నియమించారని అన్నారు. ఎటువంటి రిమార్కు లేకుండా నన్ను విధుల నుంచి తొలగించారని నన్ను ఎందుకు తొలగించారని ని అడగగా నీపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని అందుకే విధుల నుండి తొలగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం డి యు ఆపరేటర్లు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు బాసటగా "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్"

- ఈనెల 13న మెగా సాఫ్ట్వేర్ జాబ్ మేళా
- నిరుద్యోగ రహిత రామచంద్రపురం మా ఆశయం
- విద్యార్థులతో కలిసి పోస్టర్ ఆవిష్క రించిన వాసంశెట్టి సత్యం

**రామచంద్రపురం, మేజర్ న్యూస్** : రామచంద్రపురంలోని "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" ఆధ్వర్యంలో ఈనెల 13 న ప్రముఖ ఐటీ సంస్థలలో నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా మెగా సాఫ్ట్వేర్ జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం వెల్లడించారు. జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్ ను ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, విఎస్ఎం కళాశాల ప్రిన్సిపల్ కె.బాలాజీలు విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ సత్యం మాట్లాడుతూ స్థానిక విఎస్ఎం కళాశాలలో ఈ నెల 13న ఉదయం 9 గంటల నుంచి ఈ మెగా సాఫ్ట్వేర్ జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. రామచంద్రపురం నియోజవర్గంలో నిరుద్యోగ సమస్యను రూపుమాపే ఉన్నత లక్ష్యంతో "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" స్థాపించామన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో దేశంలోని ప్రముఖ 25 ఐటీ సాఫ్ట్వేర్ కంపెనీలు ద్వారా 300 మందికి పైగా నిరుద్యోగులకు సాఫ్ట్వేర్ (ఐటి) ఉద్యోగాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఈ ఉద్యోగాల ద్వారా ఏడాదికి రూ.5 నుంచి 12 లక్షల ప్యాకేజ్ ఉంటుందని తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అర్హులైన బీటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్స్ తదితర గ్రూపుల్లో ఉత్తీర్ణులైన వారంతా ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రామచంద్రపురం నియోజవర్గంలో ఒక్క నిరుద్యోగి కూడా ఉండకూడదనేది తన కుమారుడు, మంత్రి సుభాష్ ఆశయమని, కుమారుని ఆశయం తీర్చడం తండ్రిగా నా బాధ్యత అన్నారు. ఈ బాధ్యతలో తన కుమార్తె శ్రీ సత్య సాఫ్ట్ వేర్ సంస్థలో నిపుణురాలు, టీంసుభాష్ వారు తోడ్పాటు అందించారన్నారు. ఈ మెగా సాఫ్ట్వేర్ జాబ్ మేళాలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, వైజాగ్, పూణే, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి ప్రముఖ ఐటి దిగ్గజ కంపెనీలు పాల్గొంటాయి అన్నారు. గతంలో రామచంద్రపురంలో పలు జాబ్ మేళాలు నిర్వహించి ఎంతోమందికి ఉపాధి కల్పించామన్నారు. భవిష్యత్తులో టెన్త్, ఇంటర్,డిగ్రీ అర్హతలు ఉన్నవారికి కూడా జాబ్ మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే మా ఫౌండేషన్ కర్తవ్యం అన్నారు. భవిష్యత్తులోనూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. ఈ మెగా సాఫ్ట్వేర్ జాబ్ మేళాను అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం కోరారు.

## ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించాలి

- రానున్న 25 రోజులు అత్యంత కీలకం
- వివిధ సబ్జెక్టుల్లో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి
- ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లకు స్పష్టం చేసిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి

**కాకినాడ, మేజర్ న్యూస్** : ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చదువుతున్న విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాలులతో ఇంటర్మీడియట్ ఫ్రీ ఫైనల్ పరీక్షల ఉత్తీర్ణశాతం వివరాలు, మార్చి ఒకటి నుంచి జరగనున్న పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్నాయని, ఈ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియెట్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థుల విద్యా బోధనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో నేటి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయని, మార్చి ఒకటి నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఫ్రీ ఫైనల్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా రానున్న 25 రోజులు జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు అందరూ విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ప్రణాళిక ప్రకారం పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థులను వివిధ కేటగిరీలుగా విభజించి చదివించాలన్నారు. వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై మరింత దృష్టి సారించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. తరగతులకు సెల్ ఫోన్ తీసుకువచ్చే విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులకు సూచించారు. సమావేశంలో డిఐఈవో జీజీకే.నూకరాజు, ఆయా కళాశాలలో ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

## సుబ్బయ్య హోటళ్ళపై ఆహారశాఖ అధికారులు తనిఖీలు

**కాకినాడ, మేజర్ న్యూస్** : కాకినాడ సుబ్బయ్య గ్రూపు హోటళ్ళపై బుధవారం సాయంత్రం ఆహార నియంత్రణ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఒక వినియోగదారుడు సుబ్బయ్య హోటల్లోనీ విక్రయాలు జరిపే వివిధ రకాల పొడులపై గడువు తేదీ ముద్రించకపోవడంతో ఫిర్యాదు తనిఖీ అధికారులకు చేరింది. దీంతో వారు తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. దీనిపై ఫుడ్ కంట్రోల్‌శాఖ అధికారి బి.శ్రీనివాస్, ఫుడ్ ఇన్స్పెక్టర్ కె.వి. సుబ్బారావులు కేసు నమోదు చేశారు.

## కార్యకర్తలకు ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన కార్యక్రమం

కొవ్వూరు, మేజర్ న్యూస్ : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక ఎన్డీఏ కూటమికి ప్రతిష్టాత్మమైనదని, నీటిపారుదల శాఖ మంత్రి, నిమ్మల రామానాయుడు అన్నారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొవ్వూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు కొవ్వూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన పది నెలల కాలంలో వచ్చిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు కావడంతో ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎమ్మెల్సీ అభ్యర్థి పేరా బత్తుల రాజశేఖర్ ను అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. కొవ్వూరు నియోజకవర్గం లో 9754 పట్టభద్రుల ఓట్లు నమోదు కావడం జరిగిందని, ప్రతి ఓటు ఎంతో ప్రాముఖ్యమైనది అని అన్నారు.

ప్రతి 30 ఓట్లకు ఒక కార్యకర్త ఓటు వేయించడంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రతి వాటర్ ఫోన్ నెంబర్లను సేకరించి నేరుగా కలవడంతోపాటు ఫోను ద్వారా మొదటి ప్రాధాన్యత ఓటు ఎన్డీఏ కూటమి బలపరిచిన పేరాబత్తుల రాజశేఖర్ కు వేయాలని అభ్యర్థించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ద్వి సభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ,జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కొవ్వూరు నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జ్ కోట్ని బాలాజీ, నియోజకవర్గ అబ్జర్వర్ గొర్రెల శ్రీధర్, నియోజకవర్గ కన్వీనర్ మట్ల వీరాంజనేయులు, జనసేన నాయకులు గాయత్రి వెంకటేశ్వరరావు, సుంకర సత్తిబాబు ,కాకర్ల నారాయుడు, సూర్యదేవర రంజిత్ కుమార్, మాజీ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని వేమగిరి వెంకట్రావు కొవ్వూరు టౌన్ క్లస్టర్ ఇంచార్జ్ పెనుమాక జయరాజు బిజెపి మండల అధ్యక్షులు డేగల సునీత తదితర ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదో తరగతి నూరు శాతం విద్యార్థులు పాస్ కావాలి

- ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

**రంపచోడవరం, మేజర్ న్యూస్** : ఏజెన్సీ ప్రాంతంలో వచ్చేనెలలో జరగబోవు పదో తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం పాస్ అయ్యే విధంగా ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, అన్ని మండలాలకు సంబంధించిన మండల విద్యాశాఖ అధికారులు, అన్ని గురుకులాలకు చెందిన అధికారులతో ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం పాస్ అయ్యే విధంగా ప్రాజెక్ట్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలు, ప్రైవేట్ పాఠశాలలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం పాస్ అయ్యే విధంగా ఇకనుండి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు తీసుకోవాలని సంబంధిత అధికారులను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. విద్యార్థులు నూటికి నూరు శాతం పాస్ అయ్యే విధంగా ఈనెల 6వ తేదీ గురువారం ఐటీడీఏ సమావేశపు హాలులో సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు అదేవిధంగా 7వ తేదీ శుక్రవారం సబ్జెక్ట్ ఇతర ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఒక పదో తరగతి విద్యార్థి ఏవిధంగా చదువుతున్నది అదేవిధంగా ఈ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నది అటువంటి విద్యార్థిని గుర్తించి వెనుకబడిన సబ్జెక్టులకు ప్రత్యేక క్లాసులు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గిరిజన విద్యార్థులకు మంచి విద్యను అందిస్తే వారి జీవితాలు రానున్న రోజుల్లో మారుతాయన్నారు. అన్ని ఆశ్రమ పాఠశాలలో అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మెనూ పక్కగా అమలు చేయాలని, అదేవిధంగా నిత్యావసర సరుకులు, పాలు, గుడ్లు ఏవిధంగా సరఫరా చేయుచున్నది ఆరా తీశారు. వచ్చే విద్యా సంవత్సరమునకు విద్యాపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పుస్తకాలు, బట్టలు ఏర్పాటుకు నివేదికలు తయారీ చేసి సమర్పించాలన్నారు. ఏజెన్సీలో చదువుతున్న విద్యార్థులకు వచ్చే సంవత్సరం నుండి పక్కాగా ప్రొఫైల్ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయశాంతి. ఏజెన్సీ డీఈవో వై మల్లేశ్వరరావు, సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రామతులసి, కృష్ణమోహన్, కె.సుజాత, మండల విద్యాశాఖ అధికారులు రామకృష్ణ, ముత్యాలరావు, యస్. బాపిరాజు, వై.వెంకన్న, పి.శ్రీనివాసరావు, టి. సూరారెడ్డి, తాతాబ్బాయి, బిఎస్ కుమార్, గురుకులం సెల్ అధికారి నాగేంద్ర పాల్గొన్నారు.

## మెట్ట ప్రత్తిపాడు రైతు నీటి సమస్యను పరిష్కరించండి

- నీటి పారుదల శాఖ మంత్రికి విన్నవించిన ప్రత్తిపాడు శాసన సభ్యురాలు సత్య ప్రభ రాజా

**రౌతులపూడి, మేజర్ న్యూస్** : మెట్ట ప్రాంతమైన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో రైతులు సాగునీటి సమస్యను ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్నారని దానిని పరిష్కరించి రైతులకు సహకరించాలని ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామనాయుడుని నిడదవోలులో కలిసి విన్నవి చారు.ప్రత్తిపాడు నియో జకవర్గంలో వ్యవసాయ ఆధారిత ప్రజలు అధికమని,వారంతా వ్యవసాయము,దాని అనుబంధ రంగాల్లో జీవనం కొనసాగిస్తారన్నారు, ప్రస్తుతం దాల్వ పంటలకు సాగునీరు లేక నియోజవర్గంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే మంత్రివర్యులకు తెలిపారు.విశాఖ పారిశ్రామిక అవసరాలకు తరలించే ఏలేరు కాలువ నీటిని నియోజకవర్గ రైతాంగం వినియోగించుకొనే విధంగా వెసులుబాటు కల్పించాలని ఆమె కోరారు.ప్రత్తిపాడు నియోజ వర్గంలో దాదాపు నాలుగు ప్రధాన జలాశయాలు ఉన్నప్పటికీ అవి నిరుపయోగంగా ఉన్నాయని,నియోజకవర్గ ప్రజలకు అవి ఏమాత్రం ఉపయోగం పడటం లేదని సూచించారు.ఇదే విషయాన్ని రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా తెలియజేయడం జరిగిందని అన్నారు.నియోజవర్గంలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి కాలువల అభివృద్ధికి,ఏలేరు కాలువకి తూములు ఏర్పాటు చేసుకోవడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.మా ప్రాంత రైతులు ధైర్యంగా ఏడాది పొడవునా పంటలు పండించుకునే విధంగా వారికి సాగునీరు అందించి వారి రుణం తీర్చుకోవాలని అనుకుంటున్నాను అని అందుకు సహకరించాలని ఎమ్మెల్యే కోరగా మంత్రి వర్యులు రామానాయుడు సానుకూలంగా స్పందించారన్నారు.త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తానని, నియోజవర్గంలో ప్రాజెక్టులు అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు,అంతేకాకుండా రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా దాల్వా పంటకు సాగునీరు అందించవలసిందిగా అధికారులను తక్షణమే ఆదేశించారు. ఎమ్మెల్యే మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఎమ్మెల్యే వెంట సీనియర్ నాయకులు పర్వత సురేష్, యాళ్ల జగదీష్ ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి నియోజకవర్గ ఎన్ డి ఏ శ్రేణులు ఉన్నారు.

## ఏపీ చలనచిత్ర వాణిజ్య మండలి కమిటీ మెంబర్‌గా సలాది శీను బాబు

**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర వాణిజ్య మండలి వారు నిర్మాతల మండలి క్యాటగిరిలో కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ వాకలపూడి గ్రామానికి చెందిన సలాది శ్రీనుబాబును ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ మెంబర్ ఎంపిక చేయడం జరిగింది ఈ సందర్భంగా కాకినాడ వాసులు ఆనందం వ్యక్తపరిచారు.

అలాగే సలాది శీను బాబు మాట్లాడుతూ ఈరోజు తెలుగు సినిమా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని సలాది క్రియేషన్స్ తరపున నిర్మాతల మండలి ఫిలిం ఛాంబర్ సభ్యుడు గా ఎంపిక చేసిన కమిటీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## గ్రామ రెవెన్యూ అధికారులకు డీడీఓలుగా తసీల్దార్ ఉండాలి

**రావులపాలెం, మేజర్ న్యూస్ :** గ్రామ సచివాలయ ఉద్యోగులను మూడు కేటగిరీ లుగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం అని రావులపాలెం గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం పేర్కొంది .గ్రామ రెవెన్యూ అధికారులకు డీడీఓ లుగా పంచాయితీ కార్యదర్శి ఉండడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతాయని గనుక మాకు తసీల్దార్ డీడీఓ ఉండాలని విఆర్ఓల సంఘం అధ్యక్షుడు సిహెచ్.వెంకటేశ్వరావు, కార్యదర్శి పి.కనకదుర్గ, గౌరవ అధ్యక్షులు లక్ష్మీపతి ల అద్వర్యంలో విఆర్ఓలు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

# 'లేబర్ కోడ్'కు వ్యతిరేకంగా స్కీం వర్కర్ల నిరసన

రంపచోడవరం, మేజర్ న్యూస్ : కేంద్రం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా వై.రామవరంలో స్కీం వర్కర్లు బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ కు వ్యతిరేకంగా వై.రామవరం మెయిన్ సెంటర్ నుంచి మండల తహసిల్దార్ కార్యాలయం వరకు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, తదితర సమస్యలు పరిష్కారం చేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి తహసిల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కె శాంతిరాజు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించు కున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి మోడీ ప్రభుత్వం, నాలుగు కోడ్‌లు మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చారన్నారు.

వీటిని ఏప్రిల్ నుండి అమలు చేయటానికి రాష్ట్రపతి ఆమోదం పొందుతుందని పేర్కొన్నారు. ఎప్పుడైనా అమల్లోకి రావచ్చని, గతంలో కార్మిక సంఘాలు దేశవ్యా ప్తంగా సమ్మె చేసిన ఫలితంగా తాత్కాలికంగా వెనక్కి తగ్గారన్నారు. తిరిగి పునః ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. కనీస వేతనాలు చట్టాన్ని కుదించడం, 8 గంటల పనిని 12 గంటలకు పెంచడం, పిఎఫ్, ఈఎస్ఐ, బోనస్ గ్రాడ్యుటీ లాంటి సామాజిక భద్రత ఉన్న కొద్దిపాటి హక్కులను తొలగిస్తున్నారన్నారు. లేబర్ కోడ్‌లు అమలైతే గనుక సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు నిర్వీర్యం అవుతుందని, అవుట్ సోర్స్ ట్రైని అప్రెంటిస్, గౌరవ వేతనం డైలీ వేజ్ పేరుతో శాశ్వతమైన పనుల్ని తక్కువ వేతనాలతో పని చేయించుకునే దోపిడీ చేస్తున్నారన్నారు.

పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉద్యోగులకు, కార్మికులకు ఏమాత్రం ప్రయోజనం లేదన్నారు. అంబానీ, ఆదానీ లాంటి కార్పోరేట్లకు దోచి పెట్టే బడ్జెట్ అని అన్నారు. బడ్జెట్లో అన్ని వర్గాల ప్రయోజనాల్ని విస్మరించారన్నారు. కాబట్టి దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలలో ఉన్న కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్రం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్లను వ్యతిరేకించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి కె.వీరలక్ష్మి, మండల నాయకులు జె.నూకరత్నం, దాగారి పొట్టమ్మ, వెలుగు యానిమేటర్ల సంఘం మండల కార్యదర్శి మంగయమ్మ, చలివేది శ్రీకాంత్, వెలుగూరి సూర్యకాంతం, అంగనవాడీ నాయకులు జి.విమల, అంగన్వాడీ, ఆశా వర్కర్ల, వెలుగు వీఓఏలు, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూలు శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు. రంపచోడవరంలో... ప్ర భు త్వం కార్మిక చట్టాలు రద్దుచేసి లేబర్ కోడ్ లను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని ఈ చట్టానికి పూర్తి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపాలని పిలుపులో భాగంగా రంపచోడవరంలో సిఐటియు ఆధ్వర్యంలో సిఐటిఎన్ అనుబంధ కార్మిక సంఘాలు నిరసన తెలియజేస్తున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ అన్నారు. ముందుగా స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు.

అనంతరం జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ కార్మిక చట్టాలను తుంగలో తొక్కి తీసుకు వస్తే స్కీమ్ వర్కర్లు నష్టపోతారని ఈ చట్టాలు అమలు కావడం వల్ల కార్మికులకు కనీస వేతనాలు అమలు కావని కనుక లేబర్ బోర్డులను కేంద్రం పునరాలోచన చేసి వెంటనే రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివోఎ జిల్లా సెక్రటరీ రామకృష్ణ, అంగన్వాడీ నాయకురాలు రామలక్ష్మి, బషీరమ్మ, జ్యోతి భాస్కర్ పాల్గొన్నారు.

## శ్రీ రావులమ్మ అమ్మవారి ఆలయం వద్ద మహా అన్న సమారాధన 6000 మంది హాజరు

**- జ్యోతుల నవీన్,**
**గండి బాబ్జి, తుమ్మలపల్లి రమేష్ హాజరై అన్న ప్రసాదం స్వీకరణ**

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట గ్రామ దేవత శ్రీ రావులమ్మ అమ్మవారి ఆలయం వద్ద మహా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జ్యోతుల నవీన్, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త జీను మణిబాబు మాట్లాడుతూ జగ్గంపేట గ్రామదేవత, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి మా ఇంటి ఇలవేల్పు రావులమ్మ అమ్మవారి జాతర కనుమ రోజున ప్రారంభమై పద్మనాభ నగర్, మర్రి మొక్క వీధి, శెట్టి బలిజిపేట, ప్రజా రైతు కూలీ సంఘం పల్లపు వీధి వారు ప్రతివారం నిర్వహించిన రావుల మ్మ తల్లి సంబరాలు ముగియటంతో బుధవారం మహా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించామని ఈ అన్నసమారాధనలో 6000 మంది హాజరై అన్న ప్రసాదం స్వీకరించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు, జీను వెంకట్రావు, జీను రాంబాబు, జీను సోంబాబు, దేవరపల్లి మూర్తి, అడబాల ఆంజనేయులు, గెడ్డమూరి బాబ్జి, పిలా మహేష్, నేదురు గణేష్, రాయి సాయి, కోడూరి రమేష్, కొంద్రోతు శ్రీను, బండారు నాని, ముక్కాపాలు బాబు, నాండ్ల చిరంజీవి, పలివెల యేసు రాజు, జీను సత్తిబాబు, పత్రి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల గెలుపే లక్ష్యం

**- జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ**

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ పట్టభద్రుల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. గురువారం జగ్గంపేట రాజమండ్రి రోడ్ లో గల పరిణయ ఫంక్షన్ హాల్లో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జగ్గంపేట నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు పెందుర్తి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, ఉభయగోదావరి జిల్లాల పట్టబత్తుల ఎమ్మెల్సీ పే రాబత్తుల రాజశేఖర్, జగ్గంపేట నియోజకవర్గం జనసేన, బిజెపి ఇన్చార్జి లు తుమ్మలపల్లి రమేష్, దాట్ల కృష్ణ వర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ నిబద్ధతకు మారుపేరుగా, పార్టీకు విశేష సేవలు అందించిన విద్యావంతుడు, ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు గ్రామ గ్రామాన ఓటర్లతో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో సుమారు 6,500 ఓటర్లు ఉన్నారని, ప్రతి ఓటరును ప్రత్యక్షంగా కలిసి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం వివరించి ఓటు అడగాలని సూచించారు. నియోజవర్గంలో ఉన్న 14 మంది బూత్ ఇన్చార్జిలను సమన్వయం చేసుకుంటూ కూటమి నాయకులు ముందుకెళ్లాలన్నారు. విద్యావంతులైన ఓటర్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర పురోభివృద్ధి కోసం చేస్తున్న సేవలను వివరించి ఓటు వేసేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో తెలుగుదేశం,, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## గ్రామ పురోహితులు, భజన కళాకారులుకు సన్మానం

**- సన్మానించిన శెట్టిబలిజ సంక్షేమ సంఘ సభ్యులు**
**- ఏకాహానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు - పచ్చిపాల**

**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం గోరింట గ్రామంలో శ్రీ క్రోధి నామ సంవత్సర మాఘ శుద్ధ సప్తమి పురస్కరించుకుని ఫిబ్రవరి 5వ తేదిన బుధవారం చినరామాలయం (శెట్టిబలిజ రామాలయం) వద్ద 11వ వార్షికోత్సవంలో భాగంగా గోరింట శెట్టిబలిజ సంక్షేమ సంఘం సభ్యులు, గ్రమ ప్రజల సౌజన్యంతో గ్రామ పురోహితులు గోవిందవర్జుల శ్రీనివాస్ శర్మ పర్యవేక్షణలో శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం సభ్యుల ఆధ్వర్యంలో రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని ఏకాహం నిర్వహించడంలో భాగంగా బుధవారం గ్రామ పురోహితులు గోవిందవర్జుల శ్రీనివాస శర్మ, హార్మోనిస్ట్ కుంచె అచ్చారావు, డోలకిస్ట్ కుంచె రాజు, గాయకుడు సామర్లకోట రవిలకు శెట్టిబలిజ సంక్షేమ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం అధ్యక్షులు పచ్చిపాల ప్రసాదరావు మాట్లాడుతూ ఈ ఏకాహం గత 10 సంత్సరాలు మొదలుపెట్టి, 11వ సంవత్సరంలోకి అడుగు పెట్టడం జరిగిందని, ఈ కార్యక్రమాలు నిర్వహించడానికి సహకరించిన శెట్టిబలిజ సంక్షేమ సంఘం సభ్యులకు, గ్రామ పురోహితులు గోవిందవర్జుల శ్రీనివాసశర్మకు, భజన కళాకారులకు, గ్రామ నాయకులుకు, భక్తులకు, మహిళా భజన సమాజం సభ్యులకు ఆయన పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. దీనిలో భాగంగా గ్రామ పురోహితులు గోవిందవర్జుల శ్రీనివాసశర్మ మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహించతలపెట్టిన శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం అధ్యక్షులు పచ్చిపాల ప్రసాదరావు, భజన సంఘం సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. శెట్టిబలిజ సంక్షేమ సంఘ సభ్యులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం మా రామాలయం వద్ద నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఎప్పుడూ ఇటువంటి కార్యక్రమాలకు తమ తొడ్పాటు ఉంటుందని, ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలని పచ్చిపాల ప్రసాదరావును, గ్రామ పురోహితులు గోవిందవర్జుల శ్రీనివాసశర్మ, భజన సమాజ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.

## ముద్రగడను మాజీ మంత్రులు అంబటి రాంబాబు, కొట్టు సత్యనారాయణ, పేర్ని నాని

**కిర్లంపూడి, మేజర్ న్యూస్ :** మాజీ మంత్రి వైసిపి నాయకులు ముద్రగడ పద్మనాభంను మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, పేర్ని నాని,అంబటి రాంబాబులు ముద్రగడను కలిసి సంఘీభావం తెలిపారు. మాజీ మంత్రులు మాజీఎమ్మెల్యేలకు వైసిపి కోఆర్డి నేటర్ ముద్రగడ గిరిబాబు సాదరంగా ఆహ్వానించారు. ముద్రగడ నివాసంలో ముద్రగడ ఇంటిపై జరిగిన దాడి ఘటన వివరాలు అడిగి తెలుసుకుని జరిగిన సంఘటన చాలా దురదృష్టకరమని వైసీపీ నేతలు పేర్కొన్నారు.

## ఉత్సవాల సమయంలో మద్యం అమ్మకాలు నిలిపివేయండి

**- కుంతి మాధవ స్వామి, పాదగయ క్షేత్రాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేయండి**
**- విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఉత్సవాల సమయంలో మద్యం అమ్మకాలు పూర్తిగా నిలిపివేయాలని, వృద్ధులకు చిన్న పిల్లలకు మహిళకు ప్రత్యేక ద్వారాలు ఏర్పాటు చేయాలని కోరుతూ... జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు డి. వెంకటేశ్వరరావు

తన బృందంతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. పిఠాపురం పట్టణంలో ది. 6 ఫిబ్రవరి 2025వ తేదీ నుండి ది. 13 ఫిబ్రవరి 2025వ తేదీ వరకు జరుగు శ్రీ కుంతీ మాధవ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవములు మరియు పాదగయ క్షేత్రంలో ది.24 ఫిబ్రవరి 2025వ తేదీ నుండి ది.28 ఫిబ్రవరి 2025వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవములు జరగనున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేయవలసిందిగా... జిల్లా కలెక్టర్ వారిని కోరడం జరిగిందని, సదరు ఉత్సవములలో తీసుకోవలసిన చర్యలు, భద్రత, శానిటేషన్ పై చర్చించడం జరిగిందని పేర్కొన్నారు. ఉత్సవాలలో వృద్ధులకు, గర్భిణీలకు ప్రత్యేక ప్రవేశము ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా మహిళలకు రక్షణ, పట్టణంలో మద్యం అమ్మకాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పట్టణంలో మద్యం అమ్మకాలు ఆరోజు పూర్తిగా నిలిపివేయాలని కోరగా... కలెక్టర్ వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా సదరు రెండు ఉత్సవములపై పిఠాపురం పట్టణంలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేటట్లు చూడాలని కోరాన్నారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు దువ్వా మణికుమార్, సురేంద్ర దత్త, కొండేపూడి శివ తదితరులు పాల్గొన్నారు.

## చెముడులంక హై స్కూలుకు ఎస్‌బిఐ రూ.5 లక్షలతో ఫర్నిచరు వితరణ

**ఆలమూరు, మేజర్ న్యూస్ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాజమహేంద్రవరం రీజినల్ ఆఫీస్ వారు సామాజిక బాధ్యతలో భాగంగా సిఎస్ఆర్ నిధుల నుంచి అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక ఎస్టిఎస్ఎస్ఎమ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.5 లక్షల విలువైన ఫర్నిచర్ ను అందించారు. హై స్కూల్ విద్యార్థులకు అవసరమైన 18 బెంచీలు,రెండు కంప్యూటర్లుతో పాటు నాలుగు బీరువాలు,పది ఉపాధ్యాయుల టేబుల్స్, కుర్చీలు, మైకు సిస్టమ్ వంటివి బుధవారం రీజనల్ మేనేజర్ తాడపత్రి శ్రీనివాస్ పాఠశాల హెచ్ఎం భమిడిపాటి శివరామమకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ రీజన్ పరిధిలో 43 బ్రాంచ్ లు ఉన్నప్పటికీ సుదీర్ఘకాలంగా చెముడులంకలో ఉన్న బ్రాంచ్ ఎంతోమంది ఖాతాదారులతో కొనసాగుతుందన్నారు. అందుకనే ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థులకు మెరుగైన సౌకర్య కల్పించాలనే ఉద్దేశంతో చెముడులంక హైస్కూల్ ను ఎంపిక చేసుకున్నట్లు ఆయన వివరించారు. విద్యార్థులంతా వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదువుకోవడం ద్వారా మంచి భవిష్యత్తును సాధించాలన్నారు.

ఈ పాఠశాలకు మరిన్ని సేవా కార్యక్రమం చేయడానికి తమ వంతు సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. తమ స్కూల్ కి ఫర్నిచర్ అందించినందుకు కృతజ్ఞతగా రీజల్ మేనేజర్ శ్రీనివాస్, ఎస్బిఐ హెచ్ఆర్ మేనేజర్ పవన్ కుమార్, చెముడులంక బ్రాంచ్ మేనేజర్ వెంకట రమణ లను హై స్కూలు ప్రధానోపాధ్యాయులు శివరామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తమ్మన భాస్కరరావు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం, స్కూల్ పిసి కమిటీ చైర్మన్ నాగిరెడ్డి రాము,స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ తిర్నాతి వెంకటేశ్వర రావు(శ్రీను),టిడిపి, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు కొత్తపల్లి రాంబాబు,పాలూరి అర్జున్, గ్రామ పెద్దలు నాగిరెడ్డి సత్యానందం, గుండుమళ్ల రాంబాబు,ఉంగరాల బాబులు,లంకలపల్లి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యంగా లారీ నడిపిన వ్యక్తికి రెండున్నరేళ్లు జైలు శిక్ష

**- రూ. 5000/- జరిమానా విధిస్తూ తీర్పునిచ్చిన జడ్జి ఎం.బాబు**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** వాహనాన్ని వేగంగా నడిపి మోటారు సైకిలిస్టు మృతికి కారణమైన లారీ డ్రైవర్ కు రెండున్నరేళ్లు జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ పిఠాపురం అసిస్టేంట్ సెషన్స్ జడ్జి ఎం బాబు బుధవారం తీర్పు చెప్పారు. పిఠాపురం సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం... పిఠాపురం ఆర్ ఆర్ బి హెచ్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్ టెక్నీషియన్ గా పని చేస్తున్న సిగటాపు శ్రీనివాసరావు తన డ్యూటీ ముగించుకుని మోటారు సైకిల్ పై కాకినాడ వెళ్తుండగా... పిఠాపురం మండలం చిత్రాడ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం సమీపంలో వేగంగా రాంగ్ రూట్ లో వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఆ ప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. 2021లో జరిగిన ఈ కేసును అప్పటి సీఐ వైఆర్ కే శ్రీనివాస్ దర్యాప్తు చేశారు. విశాఖ జిల్లా కోటవురట్ల మండలం బోడ పాలెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ పోతల అప్పలనాయుడు(36) ను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదోపవాదాల అనంతరం ముద్దాయి పై నేరం రుజువు కావడంతో... అతనికి రెండున్నర సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ పిఠాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం. బాబు తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎమ్. ప్రకాష్ రావు మరియు జి. వినయ ప్రతాప్ తమ వాధనలను వినిపించారు. ఈకేసులో పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనువాసు మరియు పిఠాపురం టౌన్ సబ్-ఇన్స్పెక్టర్ వి. మణి కుమార్ ముద్దాయికి శిక్ష పడేలా ట్రైల్‌ను పర్యవేక్షించారు.

## గుండెపోటు నుండి కాపాడుకోవడానికి స్టేమి గుండెకు భరోసా

**- సామర్లకోట క్లస్టర్ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ అమల**

**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ప్రతి ఒక్కరు గుండెపోటు నుండి కాపాడుకోవడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్టెమీ గుండెకు భరోసా కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని సామర్లకోట క్లస్టర్ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పి అమల పేర్కొన్నారు బుధవారం సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశా వర్కర్లకు ఏఎన్ఎం లకు స్టేమి గుండెకు భరోసా కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ పి అమలా మాట్లాడుతూ గుండెపోటు లక్షణాలు ఉన్నవారు మొదటి గంటలోపు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్టేమి గుండెకు భరోసా కార్యక్రమం ద్వారా మొదటి గంటలోపు వైద్య అందిస్తే గుండెపోటు సోకినవారు ప్రాణాలతో నిలబడతారని అన్నారు గుండెపోటు సోకినవారు ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన అనంతరం మొదటి గంటలోనే ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు 45000 విలువైన తినిక్లాప్టస్ టిన్ ప్లస్ ఇంజక్షన్ ఉచితంగా అందించడం ద్వారా రోగి ప్రాణాలను కాపాడుకోవచ్చునని ఈ సందర్భంగా ఆమె తెలిపారు గుండెపోటు సోకినవారు మొదటి గంట అత్యంత కీలకమని వెంటనే చర్యలు తీసుకోవడం ద్వారా వారి ప్రాణాలు కాపాడుకోవచ్చునని అన్నారు ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం పై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో 45000 విలువైన ఇంజక్షన్ మొదటి గంటలోపే ఉపయోగించడం వల్ల గుండెపోటు గురైన వారు తమ ప్రాణాలను కాపాడుకోవచ్చునని తెలిపారు ప్రస్తుతం అన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ ఇంజక్షన్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు గుండెపోటుకు గురైన వారు 108 కి ఫోన్ ద్వారా సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోని మరియు ఏరియా ఆసుపత్రిలో ఈ 45 వేల రూపాయలు విలువైన టిని క్యాప్ ప్లస్ ఇంజక్షన్ ఉచితంగా అందిస్తామని తెలిపారు ఎవరికైనా ఛాతి నొప్పి మరియు ఎడమ భుజం లాగడం కానీ ఆకస్మిక ఆయాసం మరియు గుండె దడ వచ్చినవారు స్పృహ కోల్పోయిన వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరడం వలన వారిని గుండెపోటు నుండి రక్షించవచ్చునని తెలిపారు ఈ కార్యక్రమం పై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో డాక్టర్ పి వరలక్ష్మి కార్తీక్ రమేష్ ఏఎన్ఎం లో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో నర్సిపూడి హై స్కూల్ ఉపాధ్యాయుడు మృతి

ఆలమూరు, మేజర్ న్యూస్ : అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం నర్సిపూడి జిల్లా పరిషత్ హై స్కూల్లో ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దొంగాడ ఆనందరావు(50) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో వైద్యం పొందుతున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన మృతికి సహచర ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల విజయానికి సమిష్టిగా కృషి చేయాలి

**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖర్ విజయానికి కూటమి సభ్యులందరూ కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ అన్నారు.స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద రైతు రైతు భవన్ లో నియోజకవర్గం పరిధిలోని ఓటమి సభ్యుల నాయకులతో సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప,కూడా చైర్మన్ తుమ్మల రామస్వామి,బిజెపి నాయకులు విత్తనాల వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఎన్నిక కూటమికి కీలకమని ఎమ్మెల్సీ ఎన్నికలలో కూడా ఘన విజయం సాధించేందుకు ఓటమి నాయకత్వం మొత్తం సహకరించాలని ప్రతి ఓటర్ను కలిసి అభ్యర్థి గురించి వివరించి ఓటు పడేలా కృషిచేసి విజయానికి సహకరించాలని కోరారు.

# కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలి

**–కానూరులో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రుల పిలుపు**

**పెరవలి, మేజర్ న్యూస్ :** రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరా బత్తుల రాజశేఖరం ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కానూరులో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రులు కూటమినాయకులు పిలుపునిచ్చారు.తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు గ్రామంలో వై నాట్ ఫంక్షన్ హాల్ లో ఫిబ్రవరి 5వ తేదీ బుధవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రులు జలవనరులశాఖ మంత్రి తూర్పుగోదావరి జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, నిడదవోలు శాసనసభ్యులు పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ఎన్నికల పరిశీలకులు బూరగడ్డ వేదవ్యాస్ లు ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పెరాబత్తుల రాజశేఖరం ఎన్నికల ప్రచారంలో బాగంగా జరిగిన సమావేశంలో పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి 40 మంది గ్రాడ్యుయేట్ ఓటర్ లకు ఒక్కొక్క నాయకుడు బాధ్యత తీసుకుని వారికి ప్రభుత్వ పథకాలు గురించి వివరించి కూటమి అభ్యర్థికి వారు ఓటు వేసేలా కృషి చేయాలని అన్నారు. మంత్రి నిమ్మల

రామానాయుడు, పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫి శాఖామాత్యులు మరియు నిడదవోలు శాసన సభ్యులు కందుల దుర్గేశ్, రాజమండ్రి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కె. ఎస్.జవహర్, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు తెలుగుదేశం పార్టీ స్టేట్ ఉపాధ్యక్షులు మాజీ డిప్యూటీ స్పీకర్ బూర్లగడ్డ వేదవ్యాస్, రెగ్యులర్ పరిశీలకులు డి.వి.వి. సత్యనారాయణ, ప్రత్తిపాడుశాసనసభ్యురాలు శ్రీమతి వరపుల సత్యప్రభ, నిడదవోలు మాజీ శాసన సభ్యులు మరియు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ బూరుగుపల్లి శేషా రావు, బి.జే.పి పార్టీ జిల్లా అధ్యక్షులు టిక్కి నాగేంద్ర పాల్గొని ఉమ్మడి తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయంకోసం ఎన్నికల ప్రచారంలో అనుసరించవలసిన వ్యూహాలపై నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం,జనసేన, బి.జే.పి పార్టీల నాయకులకు మరియు కార్యకర్తలకు తగు సూచనలు చేసినారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ బిజెపి సీనియర్ నాయకులు డివిఎస్ వర్మ నిడదవోలు నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన తెలుగుదేశం, జనసేన మరియు బి.జే.పి పార్టీల మండల.పట్టణ గ్రామఅధ్యక్షులు, నాయకులు మరియు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి

**– చిన్నయ్య దొర**

**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి బీజేపీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ నాయకులు గోరకపూడి చిన్నయ్యదొర పేర్కొన్నారు. బుధవారం బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశం సామర్లకోట సంపంగితోటలో గల చక్రవర్తి అపార్ట్మెంట్ వద్ద నియోజకవర్గ ఇంచార్జ్ కొక్కిరిగడ్డ గంగరాజు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముక్య అతిధిగా హాజరైన రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ అధ్యక్షులు బీజేపీ నాయకులు గోరకపూడి చిన్నయ్యదొర హాజరై మాట్లాడుతూ గ్రాడ్యుయే ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి అభ్యర్థిగా ప్రకటించిన పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి ప్రతీ.ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అలాగే జిల్లా అధ్యక్షులు బిక్కిన విస్వేస్వర రావు ఆధ్వర్యంలో జిల్లా అంతా పర్యటించి రాజశేఖర్ విజయానికి తమ వంతు.కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సామర్లకోట పట్టణ బీజేపీ అధ్యక్షులు పుప్పాల నాగ గోవింద్, మండల అధ్యక్షులు పెంకే పుష్ప లత, పెద్దాపురం పట్టణ బీజేపీ అధ్యక్షులు బొలిశెట్టి రామ్.కుమార్, బీజేపీ నాయకులు పాలిక అప్పారావు పెంకే అరుణ్ కుమార్, దిమ్మల విజయలక్ష్మి, ఒడిమాని శివ, చుక్కా వెంకటరమణ, పోబోలు వీర గణేష్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## పీడీస్ బియ్యం అడ్డా.. మోదుకూరు గడ్డ..

ఆలమూరు, మేజర్ న్యూస్ : పిడిఎఫ్ బియ్యం దొరకాయి అంటే ఆ గ్రామం మోదుకూరు అయిఉండాలి అనేది నానుడి. వివరాల్లోకి వెళ్తే ఆలమూరు మండలం మోదుకూరు గ్రామం రాష్ట్ర స్థాయిలో భారీగా కొనేది ఈ గ్రామంలోని రైస్ మిల్లర్స్ కొనుగోలు చేస్తున్నారనేది పేరెన్నికగన్నది .ఈ గ్రామానికి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు గుంటూరు ,ఖమ్మం నుండి కూడా ఇక్కడ కు లారీ లలో తో పాటు ,నర్సిపుడి గ్రామంలో ఒక వ్యక్తి ఏజెంట్‌గా ఇక్కడ కు సప్లై చేస్తుండడం కొసమెరుపు .గత కొంతకాలంగా గ్రామానికి చెందిన యువకులు రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకుని మండల తసీల్దార్ ,ఎస్సై ,సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇస్తున్న స్పందిస్తున్న ధాఖలాలు లేవు అంటూ వాపోతున్నారు .పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదారి పడుతున్న అధికారులు పట్టించుకోక పోవడం వెనుక అధికారులు నెల నెల తీసుకుని మాములు మత్తులో దొర్లుతున్నారు అనేది జగమెరిగిన సత్యం అనేది ఇక్కడ ప్రజలు ఆరోపణ .ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకుని అక్రమ రవాణా అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ప్రారంభానికి నోచుకోని సామాజిక వైద్య కేంద్రం

జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేట మండల పరిధిలో సామాన్యులకు 30 పడకల ఆసుపత్రిని %ఎ ఎ% నిర్మించడం జరిగింది. అది నిర్మించి ఇప్పటికీ 30 సంవత్సరములు అవుతుంది అయితే ఇప్పటికీ ఆ భవనం శిధిలావస్థకు వచ్చింది దీనిపై గత ప్రభుత్వం వైఎస్ఆర్సిపి లో నూతన భవనం నిర్మాణం చేపట్టారు అది ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దానిని పూర్తి చేశారు కానీ ప్రారంభానికి నోచుకోలేని పరిస్థితి ఇప్పుడు ఉన్నటువంటి హాస్పిటల్లో రోగులు విపరీతంగా పెరిగిపోవడం తో పాటు భవనం కూడా శిధిలావస్థకు రావడం అలాగే ఇరుకుగా ఉండటం వలన పేషెంట్లు ఓపి కోసం ఒకే చోట వరుస క్రమంలో నిలబడడం వచ్చిన రోగులు కూర్చోవడం కూడా ఒకే చోట అలాగే డాక్టర్ గది ఒకే చోట ఓపి రాయించుకోవడం ఒకే చోట అలాగే మందులు తీసుకోవడం కూడా ఒకే చోట అలాగే అన్ని కూడా దగ్గర దగ్గరగా ఉండడం వలన ప్రజలందరూ ఒకరి మీద ఒకరు ఉన్నట్టుగా చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుంది అలాగే ఈ హాస్పిటల్ కి అన్ని సౌకర్యాలు ఉన్నా కానీ సరైనటువంటి విధానంలో ఉపయోగించుకోలేకపోతున్న ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు ఎప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి పూర్తయినటువంటి ఈ నూతన భవనానికి రోడ్డు మార్గం సరిగా లేనందున లేక ఏవో కారణాల వలన దీనిని ఓపెన్ చేయకుండా కాలయాపన చేస్తున్నారు ప్రజలను దృష్టిలో ఉంచుకుని రోగులను సౌకర్యార్థం ఈ యొక్క నూతన భవనాన్ని ప్రారంభించినట్లయితే ప్రజలందరికీ కూడా ఎంతో సౌకర్యార్థంగా ఉంటుందని గతంలో గౌరవనీయులు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ గారు వెళ్లి ఇప్పుడు ఉన్నటువంటి హాస్పటల్ పరిశీలించి నూతన భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పి ఇప్పటికే నాలుగైదు నెలలు పూర్తవుతుంది కానీ ఇంతవరకు ఆ యొక్క ఆస్పటల్ వైపు కూడా చూడని పరిస్థితి కాబట్టి దీనిపై జగ్గంపేట నియోజకవర్గం బహుజన సమాజ్ పార్టీ ఇన్చార్జి జుత్తుక నాగేశ్వరరావు స్పందించి ఇప్పటికైనా నూతన భవనం ప్రారంభానికి శ్రీకారం చుట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## "డ్రోన్" వినియోగంపై 97 మంది పోలీస్ కానిస్టేబుల్స్‌కు ప్రత్యేక శిక్షణ

కాకినాడ,మేజర్న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులతో,ఏలూరు రేంజ్ ఐజిపి జి.వి.జి.అశోక్ కుమార్ సూచనలతో కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లలో పనిచేసే 97 మంది హెడ్ కానిస్టేబుల్ మరియు కానిస్టేబుల్స్‌కు డ్రోన్ వినియోగించడంపై రెండు రోజులు ప్రత్యేక శిక్షణను కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయం గ్రౌండ్స్ నందు ఇప్పించారు.బుధవారం శిక్షణ తీసుకున్నవారితో జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ మాట్లాడారు. త్వరలో ప్రతి పోలీస్ స్టేషన్ కు ఒక డ్రోన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. డ్రోన్లను ట్రాఫిక్, శాంతి భద్రతలు, ఊరేగింపులు, బహిరంగ సభలు, జాతరలు, పండగలు, ఉత్సవాలలోఉపయోగించునున్నట్లు మరియు గంజాయి, డ్రగ్స్, బహిరంగ మద్యపానము, జూదములు, నాటు సారాయి పట్టుకొనడములో ఉపయోగించునున్నట్లు తెల్పినారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో కొంతమందితో డ్రోన్ ఆపరేట్ చేయించి, వారి శిక్షణ సామర్థ్యమును పరిశీలించారు. డ్రోన్ ఆపరేషన్‌లో శిక్షణ పొందిన సిబ్బంది చక్కని ప్రతిభ కనబరిచారు.

ఈశిక్షణ పొందినవారిని ఆయా స్టేషన్లలో డ్రోన్లు ఉపయోగించి డ్యూటీనిర్వహించుటకు ఉపయోగించునున్నారు.డ్రోన్ ఉపయోగించి ఏదైనా మంచి కేసు పట్టుకొనిన వారికి మెడిటోరియల్ సర్వీస్ ఎంట్రీ బహుమతి ప్రధానం చేస్తాము అని తెలియజేశారు.

## కేంద్రం బడ్జెట్ వల్ల కార్పొరేట్ సంస్థలకే ప్రయోజనం

**జీలుగుమిల్లి,మేజర్న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కేవలం కార్పొరేట్ సంస్థల కోసమే బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు ఉన్నదని రైతు సంఘం మండల కార్యదర్శి సిరి బత్తుల సీతారామయ్య ఆరోపించారు. బుధవారం జీలుగు మిల్లిలో జగదాంబ సెంటర్‌లో బడ్జెట్ ప్రతులను కార్యకర్తలతో కలిసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పత్రికా ప్రకటనలో సీతారామయ్య పేర్కొంటూ కేంద్ర బడ్జెట్లో ప్రజల గురించి ఆలోచించిన దాఖలాలే లేవని అన్నారు. సామాన్య మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని బడ్జెట్లో వారికి కేటాయింపులు లేవని అన్నారు. కేంద్ర బడ్జెట్ కేవలం కార్పొరేట్ సంస్థల జేబులు నింపేందుకే అని ఆరోపించారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని,లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శేషగిరిరావు, దాసరి రామారావు, రైతు సంఘం మండల అధ్యక్షులు జానకిరామి రెడ్డి, గాంధీ, వెంకటలక్ష్మి, చిట్టి బొమ్మ కొండలరావు రైతు సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించాలి

**– నిర్దేశించుకున్న సమయపాలన పాటించాలి**

**– నిర్దుష్ట సమయంలో రీ సర్వే పూర్తి చేయాలి – కలెక్టర్ పి.ప్రశాంతి**

**సీతానగరం/ కోరుకొండ,మేజర్న్యూస్ :** బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి జిల్లా సర్వే అధికారి బి లక్ష్మి నారాయణతో కలిసి సీతానగరం మండలం మిర్తిపాడు గ్రామంలో గ్రౌండ్ ట్రూథింగ్ పనులను పరిశీలించి రైతులతో సంభాషించడం జరిగింది. అనంతరం కోరుకొండ మండలం కోటి గ్రామంలో రీసర్వే పురోగతిని సమీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, గ్రౌండ్ ట్రూటింగ్ సర్వే ఖచ్చితత్వాన్ని ధృవీకరించడానికి క్షేత్ర స్థాయి భూమిపై డేటాను సేకరించే ప్రక్రియ అన్నారు. ఇది రిమోట్ సెన్సింగ్, కార్టోగ్రఫీ మరియు వాతావరణ శాస్త్రంతో సహా అనేక రంగాలలో ఉపయోగించ బడుతుందని తెలిపారు . క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే సర్వే బృందం జవాబుదారీతనం కలిగి ఉండాలని ఆదేశించారు. జియోలొకేషన్ రికార్డ్ , ఇమేజ్ ఫీచర్‌లను ధృవీకరించడానికి భూమిపై వాస్తవికత ఆధారంగా గ్రౌండ్ ట్రూటింగ్ సహాయపడుతుందన్నారు. గ్రౌండ్ ట్రూటింగ్ ద్వారా భూముల సరిహద్దులను గుర్తించడం సులభతరం చేస్తుందని, ఎటువంటి వివాదాలు తావులేకుండా పారదర్శకంగా ఉండేలా తోడ్పాటు పడుతుందని తెలిపారు. రైతు వారీగా సరిహద్దులు తప్పనిసరిగా గుర్తించి, మార్కింగ్ ఇవ్వలన్నారు. ఇప్పటికే రీ సర్వే నిమిత్తం కార్యాచరణ సమయపాలన పై మార్గదర్శకాలు జారీ చేశామని, ఆమేరకు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాలని ఆదేశించారు. కోరుకొండ మండలం కోటి గ్రామంలో రీ సర్వే పనులను పురోగతి పై , రికార్డుల నిర్వహణ పై సమీక్షించారు. రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను , మార్గదర్శకాలు మేరకు సమయపాలన పాటించాలని ఆదేశించారు. రీ సర్వే లో అభ్యంతరాలు ఉంటే వాటిని అర్జీదారులు సంతృప్తి చెందేలా చూడాలని , ఆమేరకు పరిష్కారం చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఈరోజుకి ఆరోజు క్షేత్ర స్థాయి లో సర్వే వివరాలు, సర్వే రికార్డులను అనుసరించి బేరీజు వేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సీతానగరం, కోరుకొండ మండలం క్షేత్ర స్థాయి సర్వే సిబ్బంది, రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## "సత్యదేవుని దర్శించుకున్న నీతి అయోగ్ కేంద్ర సహాయ మంత్రి

**అన్నవరం,మేజర్న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట స్వామివారి దర్శనార్థం నీతి అయోగ్ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ వి.కె.సరస్వత్ కుటుంబ సమేతంగా శ్రీ స్వామివారి సన్నిధి విచ్చేశారు. ముందుగా ఆలయ అధికారులు అర్చకులు, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. డాక్టర్ వి.కె సరస్వత్ శ్రీస్వామి,అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పేద పండితులు వేదఆశీర్వచనం అందించగా దేవస్థానం ఈవో వి.సుబ్బారావు శ్రీస్వామివారి ప్రసాదం అందజేశారు. ఈకార్యక్రమంలో ఏఈఓ కొండలరావు, పిఆర్ఓ దామోదర్, కృష్ణారావు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ కృష్ణ చరణానంద భారతీ స్వామితో అప్పల నాయుడు భేటీ

**పెదవేగి,మేజర్ న్యూస్:** ముండూరు గ్రామం, ముండూరు క్షేత్రంలో భారతీయ ధర్మ పరిషద్ జాతీయ మరియు కార్యనిర్వహక కార్యాలయం, శ్రీ యాజ్ఞవల్క్య రాజాశ్రమంలో పీఠాధిపతులు, భారతీయ ధర్మ పరిషద్ జాతీయ అధ్యక్షులు అభినవ వివేకానంద పూజ్య శ్రీ శ్రీ శ్రీ కృష్ణ చరణానంద భారతీ స్వామిని ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా స్వామి వారు రెడ్డి అప్పలనాయుడుని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. స్వామిమాట్లాడుతూ రెడ్డి అప్పల నాయుడుకి ఏలూరు జిల్లా నుండి జోనల్ చైర్మన్‌గా రావడం శుభపరిణామం అని అన్నారు.

ఏలూరు జనసేన పార్టీ ఇంచార్జీ గా,బడుగు బలహీన వర్గాల నాయకులు ఎన్నో రకాల సేవా కార్యక్రమాలు చేస్తూ,ఎవరికి ఎటువంటి అవసరం వచ్చినా రెడ్డి అప్పల నాయుడు ముందు వరుసలో ఉంటారని తెలిపారు.రెడ్డి అప్పల నాయుడు చక్కటి హృదయం కలవారని, సామాన్యమైన కుటుంబం నుండి వచ్చి కూడా ప్రజల ప్రజానాడీని తెలుసుకుంటూ, ప్రజల్ని ఏవిధంగా ముందుకు తీసుకెళ్లాలి ,ఉన్నత విలువలు కలిగిన రాజకీయ దురంధరుడు,వారు ముందు ముందు కూడా చక్కటి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు.

## సర్పవరం పోలీస్ స్టేషన్ వద్ద లారీ యజమానులు ఆందోళన

**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** తమ లారీలకు లోడింగ్ విషయంలో న్యాయం జరగాలంటూ బుధవారం సర్పవరం పోలీస్ స్టేషన్ వద్ద లారీ ఓనర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో లారీ యజమానులు ఆందోళన చేపట్టారు.60 సంవత్సరాలు చరిత్ర గల లారీ ఓనర్స్అసోసియేషన్ లో సుమారు 30 వేల కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయని వారికి న్యాయం జరిగే వరకూ ఆందోళన చేపడతామని అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడ రూరల్ సర్పవరం పోలీస్ స్టేషన్ నుండి ఎస్పీ కార్యాలయం వరకు ప్లకార్డులు చేత బట్టి నడుచుకుంటూ ఆందోళన చేశారు. అనంతరం అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ ఎస్పిని కలిసి విషయం తెలియజేయడంతో ఆయన సానుకూలంగా స్పందించడం జరిగింది అని శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడ సి పోర్టులో లోడింగ్ రేట్ల విషయంలో గత నెల రోజులు బట్టి ఆందోళన చేపట్టడం జరిగిందని అయితే ఎస్పీకి విషయం తెలుపమని సానుకూలంగా స్పందించారని అలాగే కలెక్టర్‌కి విషయాన్నీ తెలియపరిచి చాంబర్లో కూర్చుని రేట్లు విషయమై కూర్చుని మాట్లాడుకోమని తెలియజేశారని తెలిపారు. అలాగే సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్,మంత్రి లోకేష్ ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి కొండబాబు, ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ ల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## 6,7 తేదీలలో గుడివాకలంక సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిపివేత

**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు డి4 సెక్షన్ పరిధిలో ఉన్న భీమడోలు 132/33కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి ఏలూరు (వంగాయగూడెం) విద్యుత్ 132/33కెవి సబ్ స్టేషన్ వరకు గల టవర్ లైన్లో ఉన్న పాడైపోయిన వైరును కొత్త వైరుతో మార్చుట కొరకు 6వ తేదీ గురువారం,7వ తేదీ శుక్రవారం ఉదయం 8 గం.ల నుండి సాయంత్రం 6.30 గం.ల వరకు ఆ ఏరియా పరిధిలో గుడివాకలంక సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలైన తిమ్మారావుగూడెం, కే.డి. పురం, గుడివాకలంక, మొండికోడు, ప్రత్తికోళ్ళలంక, పైడిచింతపాడు, కొక్కిరాయిలంక, కోమటిలంక, పెద్దయగిరిమిల్లి, చిన్నయగిరిమిల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేద్కర్ తెలిపారు. చాటపర్రు, తిమ్మారావు గూడెం, కేడీపురంలో ఉన్న చాపల చెరువులకు కూడా విద్యుత్ అంతరాయం కలుగును కనుక వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా కోరారు.

## ఘనంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు వినోద్ వర్మ పుట్టినరోజు వేడుకలు

**భీమవరం,మేజర్ న్యూస్:** పశ్చిమగోదావరి జిల్లా భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) అధ్యక్షులు కలిదిండి వినోద్ కుమార్ వర్మ పుట్టినరోజు వేడుకలు జిల్లా బిజెపి కార్యాలయంలో బిజేపి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం వినోద్ వర్మ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన కేకును జిల్లా బిజెపి అధ్యక్షురాలు శ్రీదేవి,మాజీ అధ్యక్షులు తాతజీ ఇతర నాయకులు దగ్గరుండి వినోద్ వర్మ చేత కట్ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా బిజెపి అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ బీజేవైఎం అధ్యక్షులుగా వినోద్ వర్మ పార్టీ కోసం ఎంతో కృషి చేశారని,మరిన్ని ఉన్నత పదవులు ఆయన అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు.బిజెపి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కాగిత సురేంద్ర, బొంబాయి స్వీట్స్ బాపిరాజు, ఉండి అసెంబ్లీ కన్వీనర్ కోరా రామ్మూర్తి, పద్మ వర్మ,షేక్ మొహద్దీన్, గోవర్ధన్ కుమార్,దివాకర్,గాంధీ రాజు,పుల్లాజి పలువురు బిజెపి యువమోర్చా, మహిళా మోర్చా నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వినోద్ వర్మకు శుభాకాంక్షలు తెలిపారు.